# గోసాయి కథ

పరుగెత్తుతున్న కాలం తల పగిలింది—వీస్తున్న గాలి గుండె పగిలింది — అయినా గాలి వీస్తూనే ఉంటుంది. కాలం పరుగెత్తడం మారదు. కాలం అంటే ఏమిటి? పరుగెత్తడం లేకపోతే కాలం అని దేన్ని అంటారు? పరుగే మార్పు. అదే కాలం—

పగిలిన తలలోంచి అహింస కారుతోంది. పగిలిన గుండెలోని సత్యం బయటపడి తునాతునకలయింది...ఇహ సత్యం లేనట్లేనా??! సత్యం అని దేన్ని అంటారు? సత్యం ఒక వస్తువా? ఒక పదార్థమా? ఒక స్థితియా?? తెలుసుకోవడం సత్యంగావచ్చు. ఏమి తెలుసుకోవడం? కనిపించేదాన్ని గురించీ, కనిపించనిదాన్ని గురించీ తెలుసుకోవడం.

వి. యస్. అవధాని

మా గోసాయికి అంత ఆపద వస్తుందంటే మా వూళ్ళోని అన్యులూ ఆప్తులూ ఎవరూ నమ్మరు. నమ్మలేరు. కాని అదే జరిగింది.

అది జరగటానికి కారణం మా గోసాయి అవలంబించిన పద్ధతులుకూడా కొంత కారణం అని అన్యులంటారు. దీన్ని కాదనే ధైర్యం ఆప్తులకు సంఖ్యాబలంవల్ల వచ్చింది

అసలు గోసాయిది మా వూరు కాదు. అసలు తన పేరు గోసాయి కాదని ఆయనే ఎప్పుడో ఒకసారి చెప్పాడు గోసాయి మొదటిగా మావూరు ఎప్పుడు వచ్చాడో మా కాలంలో ఎవరికీ తెలియదేమో! గోసాయి మంచితనం మా వూళ్ళో ప్రతి ఒక్కరినీ ఆకర్షించింది. ఆయన మంచితనమే ఆయనకు "గోసాయి" అనే పేరు తెచ్చిపెట్టింది.

గోసాయి అందరికీ మంచివాడు. ఆయనకు వ్యతిరేకులయిన అన్యులుకూడా అతనిలోని కొన్ని సుగుణాలను చూసి అతణ్ణి ప్రేమించేవాళ్ళు. వాచా గోసాయి ఎవరినీ తెలిసి హింసించి ఎరగడు. ఆయన దరిద్రుడు కాదు భాగ్యవంతుడూ కాదు. ఆయన కావాలంటే అన్ని సుఖాలూ ఆయన కాళ్ళదగ్గర వాల్తాయి.

కాని ఆయన గొప్పతనం ఏమిటంటే తనకు ఏదైతే కావాలో అది "మనకు వద్దులే" అని అనుకుని తృప్తిపడగలడు.

★

గోసాయికి ఉపవాసం చెయ్యడం అంటే భలే సరదా. ఆ ఉపవాసం చెయ్యడంకూడా మొదట్లో నారింజరసం నీళ్ళూ తాగేవాడు. తరువాత నిమ్మరసం నీళ్ళు తాగేవాడు. ఇంకా కొంతకాలం పోయినాక సాదా వేడినీళ్ళు తాగేవాడు.

"గోసాయి ఉపవాసం చెయ్యగలగడం దేవుని మహిమవలననే" అని ఆప్తులనేవాళ్ళు.

"కాదు. ఆ నిమ్మరసం, నారింజరసం, వేడినీళ్ళు అవి ఆయన వంటికి సరిపడతయి. అలవాటు చేస్తే మనంకూడా అట్లాగే ఉండవచ్చు. అయినా గోసాయి శరీరాన్ని కష్టపెట్టి పనిచెయ్యడు. కనుక ఆయనకు శరీరాన్ని పోషించే ఆహారం అక్కరలేదు" అనేవాళ్ళు అన్యులు

ఏది ఎట్లా ఉన్నా గోసాయి ఉపవాసాలు ఆయనకు మహత్తును తెచ్చిపెట్టినయి. ఆయన వారంలో కొన్ని రోజులు మాట్లాడడు. అప్పుడు దేవుడాయనతో మాట్లాడుతూంటాడని ఆప్తులంటూండేవాళ్ళు.

ఒకసారి మా వూరువారికీ పరాయి వూరువారికీ పెద్ద తగాయిదా వచ్చింది కొట్లుకునేదాకా వచ్చింది. అసలు ఆ తగాయిదా మా తరతరాలనుంచీ వస్తున్నదే మా గోసాయి మా వూరు

తరఫున నాయకత్వం వహించాడు. మొదట్లో పరాయివాళ్ళే గెలిచినట్టు కనిపించారు. ఆ రోజులలో మా గోసాయిని వాళ్లు జైలులో పెట్టారు. చాలా బాధలు పెట్టారు. గోసాయి వాటి నన్నిటినీ ఓర్పుతో సహించాడు... దానితో గోసాయి అంటే మా వూళ్ళోని పెదా చిక్కాకీ, చిన్నా పెద్దకీ అంతులేని ప్రేమ పుట్టుకొచ్చింది. అదివరకు బీజంగా వున్న ప్రేమ మహావృక్షం అయింది.

పరాయివాళ్ళతో ఘర్షణ జరిగే రోజుల్లో గోసాయి మనుషులను ఒక దోవన నీతివంతంగా నడిపించడం ఎట్లాగా అని ఆలోచించి కొన్ని పద్ధతులు ఆచరించాడు. వాటిలో రోజూ ప్రొద్దుణా సాయంత్రం భజనలు చెయ్యడం, ప్రార్థనలు చెయ్యడం ముఖ్యమైనవి. ఆయన ఎక్కడ ఎట్లా ఉన్నా సరే ఇదిమాత్రం మానేవాడు కాదు. ఆ ప్రార్థనసమయానికి రోజూ సాయంత్రంపూట చాలామంది జనం ఆయనచుట్టూ మూగేవాళ్లు. ఆ చేరేవాళ్లల్లో కొంతమంది ఆయనకు వ్యతిరేకులుండేవాళ్ళు. ఆయనమాత్రం అందరూ తన హితులేనని అనుకునేవాడు. ప్రార్థన అయినాక ఆయన మా గ్రామంలోని ముఖ్యవిషయాలను గురించి కొన్నిమాటలు చెప్పేవాడు. ఇంకా కొంత హితబోధ చేసేవాడు. కొందరికి అవి చాలా బాగుండేవి. కొందరికి చాలా అసహ్యంగా ఉండేవి. మంచిచెడ్డలకు మధ్యనున్న పొలిమేరగీత రోజురోజుకీ సన్ననవుతుందాయె!

ఒకవిధంగా చూస్తే ఆయన ఈ సాయంత్రపు ప్రార్థనా ఉపన్యాసం—అవే ఆయనకు ఘనత తెచ్చినయి. అవే ఆయనకు పెద్ద అపకారం కూడా చేసినయి.

మనం మంచివాళ్లం కనుక అందరూ మంచివాళ్లు అని అనుకోవాలని గోసాయి అంటాడు. అది నిజంగా ఎప్పటి సంగతో! "మీరు మంచివాళ్ళే కావచ్చు. నేను మంచివాడిని కాకపోవచ్చు" అని అంటే అటువంటివన్నీ అనుమానం యొక్క ఫలితాలనీ మానవత్వంమీద అటువంటి అనుమానం ఉండడం తప్పనీ అనేవాడు!

మా వూరుకీ పరాయి వూరుకీ ఉన్న సంబంధాలు చక్కబడ్డయి. పేచీలు విడిపోయినయి. పరాయివాళ్ళకీ మా వూరుమీద కాంక్ష తగ్గింది. వాళ్ల వత్తిడి మా వూరుమీద పూర్తిగా తగ్గిపోయింది.

అప్పటికి మా వూరువాళ్ళల్లోని ఆప్తుల దృష్టిలో మా వూరు స్వతంత్రం అయింది. ఇహ అన్యులనే వాళ్ళు ఉన్నారే వాళ్లు "స్వతంత్రం అని మీరు దేన్ని అంటున్నారు. మనలో ఒఖరికి ఉన్న అన్నిరకాల కష్టాలూ పోనపుడూ అది స్వతంత్రం ఎట్లా అవుతుంది? పరాయివాడి బాధ పోయినా కానీ మన బాధలు ఎక్కువవుతున్నాయి. వాటి నుంచికూడా తప్పించుకోనని ఆప్తులకంటే ఎక్కువగా ఉన్న ఇతర్లకు సుఖం వస్తేనేగాని ఇది స్వతంత్రం అనిపించుకోదు. అట్టి స్థితి రావాలంటె మనలో ప్రతి ఒక్కడూ వివేకి కావాలి. కాలం మార్పును తనలో ఆకళింపుచేసుకోవాలి" అని అనేవాళ్లు.

వాళ్లమాటలు మా వూళ్ళో ప్రతివాళ్ళకీ నచ్చేవేమో! కాని వాళ్లను అంగీకరిస్తే గోసాయికి కోపం వస్తుందనీ—వాళ్లు చెప్పినట్లు చెయ్యడం గోసాయికి అపకారం చెయ్యడం అవుతుందనీ—అనుకుని అన్యులను వ్యతిరేకించేవారు!

అందుచేత అన్యులలోని వివేకవంతుల మాటలు మా వూళ్ళో అరణ్యరోదనం అయింది.

ఇంతలో మా వూళ్లో ఒక కొత్తముఠా బయలుదేరింది. వారు గోసాయి హృదయాన్ని బాగా తెలుసుకున్నామని చెప్పేవాళ్ళు. బహిరంగంగా కూడా గోసాయికి మా వూరుని హిందూ ఆదర్శ గ్రామం చెయ్యాలని వున్నదనీ—దాన్ని సాధించేందుకు తగిన పద్ధతులను అవలంబించడం లేదనీ అంటూండేవాళ్ళు!

గోసాయి ఆదర్శం-సాధనా సరిగ్గా తెలియని వాళ్ళకు వీళ్లు చెప్పినమాటలు నచ్చినయి. గోసాయికి ఒకవంక తన శక్తిసామర్థ్యాలమీద గొప్ప నమ్మకం. మరొకవంక భగవంతుని ఇచ్ఛ లేనిది ఏమీ జరగదని అంటూండేవాళ్లు......ఈ కొత్త ముఠాను చూసీచూడనట్లు ఊరుకునేవాడు. "ఆయన ఊరుకోక ఏం చేస్తాడు అంటారా?:: ఆయన చెపితే మా గ్రామాధికారి ఏం చెయ్యడు గనుక! అసలు మా గ్రామాధికారి చేసే ప్రతిపని గోసాయికి ముందుగా చెపుతాడు. గోసాయి ఆదర్శం లోకశ్రేయస్సు గనుక ఎవళ్లయినా వచ్చి తమ ఇబ్బందులు చెప్పుకుని సలహా అడిగితే తప్పక తనకు తోచింది చెప్పేవాడు. అట్లాగే

గ్రామాధికారీని...అందులో గ్రామాధికారి అంత వాడు కావడానికి కారణం గోసాయి యేసారు !

వ్యక్తా వ్యక్తములను ఒక తెన్నున నడపాలని గోసాయి చాలా బాధపడ్డాడు. మా వూళ్లో గోసాయి వాదనను పూర్తిగా అంగీకరించనివారు చాలామంది ఆయనశిష్యులుగా చలామణీఅయి ఆయన ఇప్పించిన పదవులలోకి వచ్చారు. వచ్చిన వాళ్ళు ఊరుకున్నారా ? అధికార వ్యామోహం పెంచుకుని ఏమిటేమిటో చేసేవాళ్లు. గోసాయికి ఇది చూస్తున్నకొద్దీ చాలా అసంతృప్తి కలిగింది. తను అనుకున్న విధంగా కాక ఇంకోక విధంగా జరగటానికి కారణం తను చెప్పిన పద్ధతులని ఆయనకు అంతరాత్మ చెప్పింది. ఇప్పుడేం చెయ్యాలి ? అన్న ప్రశ్న గోసాయికి ఎక్కువయింది.

నిజానికి ఈ అభిప్రాయాన్నే గోసాయి ఎన్నిసార్లో చెప్పాడు. ఆ వూళ్లలో కొందరు ముఖ్యులే ఆయన ఇష్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించారు. దాన్ని ఆసరాగా తీసుకుని గోసాయి అంత ముసలితనంలోనూ "నా ఆత్మ పరిశుద్ధం చేసుకోడానికి" అని చెపుతూ ఉపవాసం సాగించాడు.

ఆ వూళ్లకు పండగ పుట్టింది...వారంరోజులు జరిగాక "బలహీనులకు జరిగిన అన్యాయాన్ని సరిచేస్తాం" అని గోసాయిదగ్గరకు పోయి బతిమాలుకున్నారు. వాళ్లదగ్గరనుంచి గోసాయి చాలా వాగ్దానాలను తీసుకుని ఉపవాసం విరమించాడు.

ఆయన ఉపవసించే కాలంలో కొంతమంది ఆయన ఉన్న చోటికి పోయి "గోసాయి చచ్చినా ఫరవాలేదు. ఆయన ఈ లోకంలో ఉండాల్సినవాడు కాదు. ఈయనవల్ల హిందూమతానికే అపచారం జరుగుతుంది గోసాయిని చావనియ్యండి" అనే నినాదాలను ఇచ్చారు. ఎంత అపచారం ? ఎంత సాహసం ?

వాళ్లకు మా వూళ్లో తగినంత బలం చేకూరుతోంది. ఆ సంగతి తెలిసికూడా గ్రామాధికారి తెలియనట్లు ఊరుకోవలసివచ్చింది. ఎందుకంటే గోసాయి ఒకసారి ఈ కొత్తముఠాను గురించి మాట్లాడుతూ వాళ్లుచేసే పిల్లిమొగ్గల కసరత్తు అవీ బాగానే ఉన్నాయి అన్నాడట. బాగా ఉన్నదంతా ఇష్టమైనదేనా ?

ఆయన చిత్తప్రవృత్తిలో ఉన్న తమాషా అదే! తనకు దేనితోనూ సంబంధం లేనట్లు ఉండేవాడు. మళ్లీ ప్రతిదాని వైఖరీని వెనుకా ముందూ ఆలోచించకుండా "ఇది బాగుంది అనో లేక ఈ పద్ధతి బాగుండలేదు" అనో ఒక అనుమానంతో కూడుకున్న రిమార్కు పారేసేవాడు.

పైగా తను చెప్పినట్లు తన ఆ వూళ్లలో కొందరు ముఖ్యులే చెయ్యనప్పుడు "వాళ్ళు ఏమను కుంటారోలే" అనో లేక "మన కెందుకులే" అనో లేక "నన్ను చూసి వాళ్లే కొంతకాలానికి నేర్చుకొంటారులే" అనో ముభావంగా ఊరుకునేవాడు.

ఇన్ని వ్యతిరేకాల మధ్యంగా గోసాయి హృదయం ఉన్నా ఆయనలో ప్రాయికంగా ఉన్న హేతువాదం చివరదశలో పైకి వచ్చింది. అందుకనే బలహీనులమీద ఆయనకి అంత దయ వచ్చింది. "బలహీనులకు న్యాయం చెయ్యాలి" అని ఆయన గ్రామ పెత్తందారులకు చెప్పాడు. ఆయన వినలేదు. అందుకనే గోసాయి చివరిగా ఉపవసించాడని మా గ్రామం అంతా అనుకుంటున్నది. అట్లా తన అభ్యుదయానికి కారకుడయిన గోసాయి కష్టపడడం చూడలేని ఆ వూళ్లు ఆయన చెప్పినట్లు చెయ్యక తప్పింది కాదు.


## కృష్ణవేణి సిరాలు




ఉల్లమలరఁ జేయు నల్లఁదనమునందు,
పరుగు తరుగు లేని పొంకుఁదలను,
ఎవకు నింపుఁగూర్చు కృష్ణవేణిసిరాలు
పొదలు కృష్ణవేణి నదిని బోలి.

మద్రాసు, దక్షిణజిల్లాలకు డిస్ట్రిబ్యూటర్లు:
సి. ఆర్. తిరుమల్ ప్రసాద్,
141, గోవిందప్పనాయకన్ వీధి, మద్రాసు1.

ఆ కొత్త మతంవాళ్లు రోజూ ప్రొద్దునా సాయంత్రం గోసాయి మాదిరే సమావేశాలూ, ప్రార్థనలూ చేసేవారు. అయితే వీళ్ళ సమావేశాలు గోసాయి సమావేశాల మాదిరివి కావు, వాళ్ళ ప్రార్థనలో:

"హిందూదేశామతల్లీ నమస్కారము. నీవు సుఖంగా ఉండాలి. అందులోనే మా సుఖం ఉన్నది. నీ శ్రేయస్సుకి మా సర్వస్వం అర్పిస్తాం. దేవుని దయవల్ల ఈ దేశాన్ని హిందూరాష్ట్రంగా చెయ్యడానికి ప్రయత్నిస్తాం. ఎన్ని కష్టాలు వచ్చినా మా ఈ ప్రయత్నం వదలం......" అనే సారాంశం ఉండేది. వాళ్ల సమావేశంలో ప్రతి వాళ్ళూ గంతులువేస్తారు. చేతిలో లాఠీలు ఉంటయి. కత్తులతో సాము చెయ్యడంగూడా నేర్చారు. అట్లాంటివి వాళ్లు ప్రదర్శనాలలో చూపుతుంటే చూసేవాళ్లకి "మనంకూడా అవి నేర్చుకుంటే బాగుంటుంది" అని అన్నట్లు ఉండేవి. అట్లాగే వాళ్ళ సంఖ్య రోజురోజుకూ పెరిగింది. వాళ్లు ఆ కర్రలు తిప్పేప్పుడు చూసిన, మా గ్రామాధికారి "చాలా బాగుంది" అన్నాడు. కాని అతని హృదయంలో ఓ మూల కోడిదూడల్లే నక్కివున్న విచక్షణాభావం "వీళ్లు ప్రమాదం తెస్తారు" అని అంటూనే వుంది.

ఆ మతంలో గొప్పగొప్పగా చదువుకున్న వారున్నారు. మంత్రాలతో మతాన్ని వ్యక్త పరిచేవారున్నారు. పత్రికాధిపతులున్నారు. ఇంకా నానాగోత్రాల వారున్నారు.

చూడండి ఒకపల్లేరుకాయ కాల్లో గుచ్చుకుంటుంది. దాన్ని తీసి మన దొడ్లోనే పారేశాం. దొడ్లోనే సుమా! ఆ కాయనుంచి నానాకాలంలో మొక్క మొలిచింది. దాన్ని చూసీచూడనుండా ఊరుకున్నాం. అది కాయలు కాచింది అవి ఎండకు ఎండి పగిలి వాటిలోని పల్లేరుకాయలు దొడ్డి నాలుగుమూలలా పడినయి...దొడ్డి అంతా పల్లేరుకాయల మయం.

... ... ...

ప్రకృతి ఏడుస్తోంది.

ఆకాశం రెపరెపా కొట్టుకుంటోంది. పరుగెత్తే మబ్బులు మూలుగుతున్నాయి—

భూకాంత మౌనం దాల్చింది—

ఎందుకో ఇదంతా?

గ్రామపెత్తందారు గోసాయితో మాట్లాడడానికి వచ్చాడు. మాట్లాడుతున్నాడు. గోసాయికి ప్రార్థనాసమయమైంది. అయిదునిముషాలు ఆలస్యంకూడా అయింది. ఆ సంగతి గోసాయి పెత్తందారుతో అన్నాడు. పెత్తందారు వెళ్ళిపోయాడు. గోసాయి మొన్న చివరిసారి ఉపవసించినాక బొత్తిగా శక్తిలేకుండా ఉన్నాడు పైగా డెబ్భయేళ్ళు దాటినవాడు.

అప్పటినుంచి మా వూళ్ళో ఇద్దరు బాలికలు ఆయనకి ఉపచారం చేసేవారు. వాళ్ళే ఆయన్ని భుజాలపై ప్రార్థనస్థలానికి తీసుకు వస్తున్నారు.

ప్రార్థనాస్థలానికి అంతమంది రావడం గ్రామాధికారికి ఇష్టంలేదు. కాని అట్లా జనం రావడం ఆయనకు కొంత మంచీ కొంత చెడూ చేసినయి. అయినా ఈ కారణంచేత ప్రార్థనకు వస్తున్న వారిని జాగ్రత్తగా పరిశీలించి లోనికి పంపుతానని పెత్తందారు అంటే "అట్లా వీలులేదు. వాళ్లకు నా మీద ప్రేమ ఉన్నది. ప్రేమకు పాత్రుడయిన వాడు చంపబడడు. చంపబడినా వాడికి భయం లేదు. వాళ్లను పరిశీలించరాదు" అని గోసాయి మందలించాడు.

రోజూమాదిరే ఆ రోజూ చాలామంది వచ్చారు. వాళ్ళల్లోంచి ఒకమనిషి ముందుకు వచ్చాడు. గోసాయి నెమ్మదిగా నడిచివస్తుంటే ఆ మనిషి వంగి నమస్కరించి "దాదా! ఈ రోజు మీరు అయిదునిముషాలు ఆలస్యం" అన్నాడు.

గోసాయి తిరిగి నమస్కరించి "అవును" అన్నాడు అంతే,

"ఢాం ఢాం ఢాం ఢాం ఢాం"......అయిదు మోతలు.........

గోసాయి కిందపడిపోయాడు. బాలికలు వలవలా ఏడుస్తున్నారు. ముందుకు వచ్చిన ఆ పెద్దమనిషి కొత్తమతానికి చెందినవాడు. ఆయనగారి కవిత్వమే ఇది.

పైగా వుడాయిద్దామని చూశాడు కాని జనం వెంటబడి పట్టుకున్నారు. అరగంటలో పెత్తందారు, అధికారి, వారూ, వీరూ అందరూ గోసాయి చుట్టూ చేరారు. కాని గోసాయి... ఇహ లేడు. గోసాయిని కాల్చిన ఆ పెద్దమనిషి ఒక పత్రికాసంపాదకుడట! అహ సృష్టివైచిత్ర్యము!—కాదు.

నైతిక విలువలు లేని మత దురహంకార చర్య! —కాదు.

హేతురాహిత్యమైన మానసిక దౌర్బల్యం యొక్క వైచిత్రి! కాదు...మరేమిటి?